# ఉద్యమకారులకు పెన్షన్ ఆదేశాలు రావడం చారిత్రాత్మకం

## తెలంగాణ పోరాట యోధుల త్యాగాలకు హైకోర్టు తీర్పు ప్రతీక

## 49 మంది తొలి తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్ ఆదేశాలు



**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ ఆగస్టు 26**

తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్ ఆదేశాలు జారీ కావడం చారిత్రాత్మక పరిణామమని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు.న్యాయ రంగంలో హైకోర్టులకు ప్రత్యేక పాత్ర ఉందని, తెలంగాణ హైకోర్టు ఉద్యమకారులకు పెన్షన్ ఆదేశాలు జారీ చేయడం వారి త్యాగాలకు గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రొఫెసర్ ననుమాస స్వామి అధ్యక్షతన నిర్వహించిన తొలి ఉద్యమకారుల విజయోత్సవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.తెలంగాణ చరిత్రలో సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన వరకు ఎన్నో ఉద్యమాలు జరిగాయని జస్టిస్ చంద్రకుమార్ గుర్తుచేశారు. తెలంగాణ కోసం జరిగిన పోరాటాల్లో అనేక మంది ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. తొలి తెలంగాణ ఉద్యమంలో పోలీసు కాల్పుల్లో 369 మంది మృతి చెందగా, మలి తెలంగాణ ఉద్యమంలో సుమారు 1,200 మంది ఆత్మబలిదానాలు చేశారని వక్తలు పేర్కొన్నారు. అయితే ఎన్నో ఏళ్లుగా పోరాడిన ఉద్యమకారులకు తగిన గుర్తింపు, ప్రయోజనాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు.రాష్ట్రం ఏర్పడటం వాస్తవమే అయినప్పటికీ, ఉద్యమకారులకు న్యాయం జరగకపోతే అది పూర్తి విజయం కాదని పాశం యాదగిరి అన్నారు.ఉద్యమకారులు సాధించుకున్న పెన్షన్ హక్కే నిజమైన విజయమని పేర్కొన్నారు.హైకోర్టు నుంచి ఆదేశాలు పొందిన ఉద్యమకారులకు హైదరాబాద్‌లో హైడ్రా సేకరించిన భూములను కేటాయిస్తే వారి త్యాగాలకు మరింత సముచిత ప్రతిఫలం లభించినట్లవుతుందని మాడభూషి శ్రీధరాచార్యులు అన్నారు.తెలంగాణ విట్టల్ మాట్లాడుతూ ఉద్యమకారుల పోరాటానికి ఫలితంగానే ఉన్నత న్యాయస్థానం 49 మంది తొలి తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశించడం చారిత్రక ఘట్టమన్నారు. ఒకే వ్యక్తిగా ననుమాస స్వామి న్యాయవాదిగా వాదించి ఉద్యమకారులకు పెన్షన్, భూమి, రిజర్వేషన్ల కోసం పోరాడటం అపూర్వమైన విషయమని కొనియాడారు.మరో వక్త మంద ఐలయ్య మాట్లాడుతూ..కాసు బ్రహ్మానందరెడ్డి పార్కులో తెలంగాణ అమరవీరుల విగ్రహాలను ఏర్పాటు చేస్తేనే వారికి నిజమైన నివాళి అర్పించినట్లవుతుందని అన్నారు. అమరవీరుల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సందర్భంగా పెన్షన్ పొందిన 49 మంది తొలి తెలంగాణ ఉద్యమకారులను ఎన్ఎస్ టీవీ అధినేత ననుమాస సుభాష్ కుమార్ శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఉద్యమకారులకు పెన్షన్ ఆదేశాలు రావడాన్ని విజయోత్సవంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యమకారులు, నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.





# మంగపేటలో ఘనంగా చేయూత పెన్షన్ల పంపిణీ

## పేదలు, వృద్ధులు, వికలాంగుల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం -- మంత్రి సీతక్క

## ములుగు జిల్లా అభివృద్ధికి పెద్దపీట -- రూ.59 కోట్లతో రహదారి పనులకు నిధులు



**తెలుగు గళం మంగపేట, ములుగు :**

మంగపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద బుధవారం చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ, గ్రామీణ మంచినీటి సరఫరాల శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క గారు ముఖ్య అతిథిగా హాజరై అర్హులైన లబ్ధిదారులకు చేయూత పెన్షన్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం పేదలు, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులైన వర్గాల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులపై తగినంత శ్రద్ధ చూపలేదని విమర్శించారు. ప్రస్తుతం ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, చెక్‌డ్యామ్‌లు, తాగునీరు తదితర మౌలిక వసతుల అభివృద్ధి పనులకు ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు. ఏటూరునాగారం నుంచి దుగనిపల్లి వరకు జాతీయ రహదారి అభివృద్ధికి రూ.43 కోట్ల నిధులు, కాటాపూర్ నుంచి మంగపేట వరకు రహదారి అభివృద్ధికి రూ.16 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. ఆయా పనులకు సంబంధించిన టెండర్ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంగపేటలోని శ్రీ హేమాచల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. ములుగులోని మల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధి గురించి ఇటీవల ప్రస్తావించిన సందర్భంలోనే మంగపేటలోని హేమాచల క్షేత్ర అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తామని స్పష్టం చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణలో ప్రజా సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి తెలిపారు. పాఠశాలలు, దేవాలయాలు, రహదారులు, గ్రామీణ మౌలిక వసతులతో పాటు పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇస్సార్ ఖాన్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు మైల జయరాం రెడ్డి, ఎంపీడీవో భద్రు నాయక్, జిల్లా పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ పూజారి సురేందర్, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, జిల్లా లీగల్ సెల్ చైర్మన్ బండ జగన్మోహన్ రెడ్డి, ఆర్టీఏ డైరెక్టర్ వసంత శ్రీను, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సభ్యులు మురుకుట్ల నరేందర్, మార్కెట్ కమిటీ సభ్యులు కొమురం బాలన్న, జిల్లా ఆత్మ కమిటీ సభ్యులు గాదె శ్రావణ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు శానం నిర్మల, జిల్లా కార్యవర్గ సభ్యులు పాయం అనిత తదితరులు పాల్గొన్నారు.





# మిలాద్ ఉన్ నబీ వేడుకలు ఘనంగా నిర్వహణ

## శాంతి, సోదరభావం, మానవత్వమే ప్రవక్త మహమ్మద్ బోధనలు -- మత సామరస్యానికి ప్రతీకగా ర్యాలీ



**తెలుగు గళం ఏటూరునాగారం:**

ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మదినాన్ని పురస్కరించుకుని ఏటూరునాగారం మండల కేంద్రంలో ముస్లిం సోదరులు మిలాద్ ఉన్ నబీ వేడుకలను భక్తిశ్రద్ధలతో, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు, యువత, చిన్నారులు పాల్గొని పచ్చ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ సందర్భంగా ప్రవక్త మహమ్మద్ బోధనలు, శాంతి సందేశాలను ప్రజలకు వివరించారు. ప్రవక్త మహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) మానవాళికి అందించిన శాంతి, సోదరభావం, ప్రేమ, దయ, మానవత్వం, పరస్పర గౌరవం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని మతపెద్దలు సూచించారు. సమాజంలో కుల, మత భేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ర్యాలీలో మతపెద్దలు, ముస్లిం మైనారిటీ నాయకులు, యువకులు, చిన్నారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ ఆగస్టు 26**

మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ పరిధిలోని శివునిపల్లి మసీదులో ఘనంగా వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజలకు స్వీట్లు పంపిణీ చేసి, సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్వాహకులు సందేశం ఇచ్చారు.మతాలకు అతీతంగా ప్రజలంతా పరస్పరం ప్రేమ, గౌరవంతో మెలగాలని, సమాజంలో ఐక్యతను కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు.మహ్మద్ ప్రవక్త బోధించిన శాంతి, సోదరభావం, మానవత్వం వంటి విలువలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాన్ని యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ జానీ బాబా ఆధ్వర్యంలో నిర్వహించారు.కార్యక్రమంలో రహ్మాన్, అహ్మద్, అష్రఫ్, ఇలియాస్, ఫయాజ్, రఫత్, మునావర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అన్యాయం జరిగితే పోరాటం చేస్తాం- బొజ్జపల్లి సుభాష్

**తెలుగు గళం న్యూస్ జఫర్‌గడ్ ఆగస్టు 26**



హిమ్మత్‌నగర్ చెరువును మినీ రిజర్వాయర్‌గా మార్చే ప్రతిపాదనను పునరాలోచించాలని బీజేపీ రాష్ట్ర నాయకులు బొజ్జపల్లి సుభాష్ ప్రభుత్వాన్ని కోరారు.కాలువ నిర్మాణ ప్రణాళికను మార్చడం వల్ల చెరువును నమ్ముకుని జీవిస్తున్న 100కు పైగా దళిత రైతు కుటుంబాలు భూములు, జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు.జాఫర్‌గఢ్ మండలం హిమ్మత్‌నగర్‌లో బీజేపీ మండల అధ్యక్షులు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ ఆధ్వర్యంలో బొజ్జపల్లి సుభాష్ పర్యటించి చెరువును పరిశీలించారు. ముంపు బాధిత రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.రైతులకు అన్యాయం జరిగితే బీజేపీ అండగా ఉంటుందని, అవసరమైతే పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు.గతంలో ఉప్పుగల్లు రిజర్వాయర్ నుంచి పాలకుర్తికి నీటిని తరలించేందుకు కాలువ నిర్మాణం కోసం భూములు సేకరించి రైతులకు నష్టపరిహారం అందించారని, ఇప్పుడు మినీ రిజర్వాయర్ ప్రతిపాదనతో రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ వలిపాషా,తౌటి సురేష్‌గౌడ్, మేరుగు రామరాజుగౌడ్, తౌటిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ముస్కు స్వప్నతో పాటు బాధిత రైతులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి




**సత్తుపల్లి,ఆర్ సి,ఆగస్టు 25(తెలుగుగళం) న్యూస్ :** మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, దివ్యాంగులు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ నియమితులయ్యారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం అసెంబ్లీలో ఆమె కమిటీ సభ్యురాలిగా బాధ్యతలు స్వీకరించారు. కమిటీ చైర్‌పర్సన్‌గా నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి నియమితులయ్యారు. ఎమ్మెల్యే డా. మట్టా రాగమయి దయానంద్ కి కీలక బాధ్యతలు అప్పగించడంపై జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుచ్చకాయల సోమిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

# గోపాల కిషన్ కుటుంబానికి ఆర్థిక సాయం

**స్టేషన్ ఘనపూర్/ తెలుగు/ గళం,ఆగస్టు 26:**



స్టేషన్ ఘనపూర్ మండలంలోని పాంనూర్ గ్రామానికి చెందిన కందుకూరి గోపాలకిషన్ ఇటీవల రైలు దిగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారీ పడిపోయి మరణించారు. కందుకూరి గోపాల కిషన్ అయ్యప్ప మాల ధరించేవారు. మణికంఠ సేవా సొసైటీ సభ్యులు తమ తోటి అయ్యప్ప మాల దారులు గోపాలకిషన్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. గోపాలకిషన్ లేకపోవడం వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు.తమ తోటి మాలాదారుని కుటుంబానికి మేము అండగా ఉంటామని ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ మణికంఠ సేవా సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

